

# సత్యానికిక స్వేచ్ఛ!

గాలి, నీరు కలుషితమైతే ఎంత ప్రమాదమో సత్యదూరమైన సమాచారమూ అంతటి హానికరం. రచనా నైపుణ్యంతో అబద్ధాన్ని నిజమని నమ్మించడం, కల్పనాచాతుర్యంతో అక్షరాల కనికట్టుకు పాల్పడడం తెలుగునాట కొన్ని ప్రసార మాధ్యమాలకు నిత్యకృత్య మైపోయింది. అత్యధిక సర్క్యులేషన్ గల దినపత్రికలు, విశేష వీక్షక బలం గలిగిన టీవీ ఛానళ్లు రాజకీయ స్వప్రయోజకశక్తుల చేతిలో అమరిన ఆయుధాలుగా, వారి 'సహజ' కవచాలుగా పనిచేస్తూ ఒక వర్గానికి వెన్నుదన్నుగా వ్యవహరిస్తున్నాయి. అమితమైన సమాచార కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి. పనికట్టుకొని గోబెల్స్ ప్రచారానికి పాల్పడుతున్నాయి. అనుదిన, అనుక్షణ దుష్ప్రచారపు బాకాలుగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాభిప్రాయాన్ని వండివార్చే పనిలో తలమునకలయ్యాయి. అయితే తెలుగు పాఠకుల చైతన్యం అసిధార వంటిది. పాలనూ నీటినీ వేరు చేయగల తెలివి వారి సొంతం. ఒక్క తాలు గింజను చూపించి గంపలోని ధాన్యమంతా తాలేనని నమ్మించజూస్తే నమ్మే మూఢత్వం వారికి లేకపోవడమే ఈ నేల అదృష్టం.

అద్దం అబద్ధమాడకూడదు. కానీ ప్రత్యేకంగా తయారు కాబడిన అద్దాలు తాము చూపించదలచుకున్నదే చూపిస్తాయి. అత్యధిక ప్రాచుర్యం గలిగిన ఒక తెలుగు దినపత్రిక యజమాని తాను మొదటి నుంచీ నిర్దిష్టంగా ఒక రాజకీయ పక్షానికి వ్యతిరేకిననే భావనను పవిత్ర ధర్మాసనం ముందే వ్యక్తం చేశారు. అతని ముంజేతి చిలుక అయిన ఆ దినపత్రిక ఎటువంటి వాణి వినిపిస్తోందో వేరే చెప్పనవసరం లేదు. ఆంధ్రప్రదేశ్‌ను సమాచార అంధకారం ఆవహించిందనేందుకు ఇంతకంటే తార్కాణం కావాలా? ఏకపక్ష సమాచారం వల్ల ప్రజల్లో ఏ విషయంపైనా లోతైన చర్చ జరగకపోగా ఆ సమాచారం పట్ల వెగటు ఏర్పడుతుంది. అటువంటి సమాచారాన్నందించే సాధనాల పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుంది. మీడియా విశ్వసనీయత తగ్గడం ప్రజాస్వామ్య విశాల హితానికే హానికరం. రాష్ట్రంలో నేడీ దుస్థితి తలెత్తి గాఢతరమవుతున్నది.

బలమైన ఏకపక్ష మీడియా అసత్యాలతో, అర్ధ సత్యాలతో సృష్టిస్తున్న గందరగోళాన్ని తొలగించి వీలైనంత వాస్తవ సమాచారాన్ని అందించే లక్ష్యంతో రాజకీయ, సామాజికార్థిక వారపత్రిక 'ఈవారం జనవార్త' వెలువడుతున్నది. ఈ రోజు మీ కరకమలాలను అలంకరించిన 'ఈవారం' రాష్ట్రంలో సమాచార స్వాతంత్ర్యాన్ని ఆవిష్కరించే దిశగా మేము సాగిస్తున్న అక్షర యజ్ఞానికి దర్పణం. దుష్ప్రచారకుల బందీగా ఉన్న సత్యానికి స్వేచ్ఛ కలిగించడమే మా దృఢసంకల్పం. అబద్ధం నోరు పెద్దది. కొండంత వెలుగులు పంచే నిజం గోరంత దీపం వంటిది. ఈ దీపాన్ని కాపాడవలసిన బాధ్యత మీ అందరిదీ...



ఉండవల్లి అరుణ్‌కుమార్